క్లుప్తంగా

జాతీయ నాయకుల విగ్రహాలకు వినతిపత్రాలు



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

రామచంద్రపురం: సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు సచివాలయం ఉద్యోగులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ, చైర్మన్ విత్తనాల హరి కృష్ణ తదితరులు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుంచి వివిధ దశల్లో అనేక ఉద్యమాలు చేస్తున్నామన్నారు. సర్వేల నుంచి మినహాంపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ నాయకులను సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఆహ్వానించాలని కోరారు. వైస్ చైర్మన్ పులగం రామారెడ్డి, కన్వీనర్ రుద్రాక్షుల దుర్గాప్రసాద్, కో కన్వీనర్ చోళ్లంగి సత్యనారాయణ, నాయకులు ఎమ్. గంగరాజు, సత్యవాణి పాల్గొన్నారు.

ఉద్యోగులకు శిక్షణ

కపిలేశ్వరపురం: గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ పంచాయతీ పన్నులు వసూలు చేయాలని ఎంపీడీఓ హెచ్ భానూజీరావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఓన్ రీసోర్స్ రెవెన్యూపై శుక్రవారం రెండో రోజు శిక్షణ తరగతిని నిర్వహించారు. అంశంపై గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు అడిగిన అనుమానాలను శిక్షకుడు కె.రామకృష్ణ నివృత్తి చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ జి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన భక్తి గీతాలాపన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ద్రాక్షారామ కోటిపల్లి ప్రధాన రహదారి పక్కన దసరా ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు శనివారం ఏర్పాటు చేసిన భక్తి గీతాలాపన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకర్షించింది. కె.గంగవరం మండలం తమ్మాయపాలెంకు చెందిన రాయుడు వెంకటేశ్వరరావు భజన బృందం భక్తి గీతాలు ఆలపించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



టేకిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కపిలేశ్వరపురం: గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం అన్నారు. ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ అధికారి యు.పూర్ణిమ పర్యవేక్షణలో శనివారం టేకిలో పోషణ మాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి, సూపర్‌వైజర్ మాణిక్యం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని గర్భిణు, బాలింతలకు సూచించారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. కార్యక్రమంలో ఉమ్మిడిశెట్టి సూరిబాబు, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బాణసంచా తయారీదారులు నిబంధనలు పాటించాలి



వి.సావరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: బాణసంచా తయారీదారులు నియమ నిబంధనలు పాటించాలని, తయారీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు హెచ్చరించారు. మండలంలోని వి.సావరం గ్రామ పరిధిలోని భవాని గ్రాండ్ ఫైర్ వర్క్సను సీఐ దొరరాజు, ఎస్సై డి.సురేష్‌బాబుతో కలసి ఆకస్మికంగా సందర్శించారు. నేషనల్ బిల్డింగ్ కోడ్ 2005 ప్రకారం ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. తయారీ కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

వివాదాస్పద ఫ్లెక్సీలు తొలగించండి

మామిడికుదురు: గ్రామాల్లో వివాదాలకు కారణమవుతున్న ఫ్లెక్సీలను తొలగించాలని నగరం ఎస్ఐ చైతన్యకుమార్ సూచించారు. ఎంపీడీ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు జరుగుతున్న శిక్షణా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో ఫ్లెక్సీలపై రాసిన రాతలు శాంతి భద్రతల సమస్యగా మారాయన్నారు. వివాదాస్పద కొటేషన్లతో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రామాల్లో ఏర్పాటు చేయకుండా కట్టడి చేయాలన్నారు.

ఈ-పంట నమోదులో జాప్యం

- అధికారుల నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపం
- పంట నమోదులో వ్యవసాయ శాఖాధికారులు నిమగ్నం
- మరో మూడు రోజుల్లో ముగియనున్న గడువు
- ఇప్పటి వరకు 78.78 శాతం పూర్తి



ఈ- పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు, సిబ్బంది

రాయవరం: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అనేక సంక్షేమ పథకాలకు ఈ- పంట నమోదు ప్రామాణికం. ఈ-పంట నమోదు గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఇప్పటి వరకు సుమారు 79 శాతం ఈ-పంట నమోదు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ-క్రాప్ నమోదును గడువు ముగిసేలోగా శత శాతం పూర్తి చేయాల్సి ఉంది. ఈ-క్రాప్ నమోదుతో పాటు, ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. ఈ-క్రాప్ నమోదు ఎంతమేర చేశారనే అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశిస్తున్నారు. ఈ-పంట నమోదులో అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారనుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపోయిన సందర్భంలో బాధిత రైతులకు పరిహారం అందించేందుకు ఈ- పంట నమోదును అధికారులు పరిగణలోకి తీసుకుంటున్నారు.

క్లస్టర్ పరిధిలో పరిస్థితి ఇదీ

మండలం	రైతులు	లక్ష్యం (ఎకరాల్లో)	బుకింగ్ (ఎకరాల్లో)	శాతం
రాయవరం	9,181	17,436	14,507	98.95
మండపేట	8,846	17,552	16,028	94.65
కె.గంగవరం	11,818	22,124	15,690	94.00
రామచంద్రపురం	12,683	24,260	18,156	92.13
కపిలేశ్వరపురం	9,339	20,372	15,774	89.33
మొత్తం	51,867	1,01,744	80,155	78.78

క్లస్టర్ పరిధిలో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో వరి సాగు 1.02 లక్షల ఎకరాల్లో రైతులు చేపట్టారు. వ్యవసాయశాఖ అధికారులు ఈ ఏడాది జూలై 20వ తేదీ నుంచి ఈ-క్రాప్ నమోదును ప్రారంభించారు. సెప్టెంబరు 15వ తేదీ నాటికి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నా వివిధ కారణాలతో ఈ నెలాఖరుకు గడువును పెంచారు. ఈ-క్రాప్ నమోదును పూర్తి చేసిన తర్వాత ఈ జాబితాలను రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద నోటీస్ బోర్డుల్లో ఉంచాలి. ఈ జాబితాలపై గ్రామ సభలు నిర్వహించి రైతుల సమక్షంలో తనిఖీలు పూర్తిచేయాల్సి ఉంది. ఈ జాబితాలపై రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించిన తర్వాత తుది జాబితాలను ప్రకటించాలి.

అన్నింటికీ ఆధారం

ఈ-క్రాప్ రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేస్తేనే రానున్న రోజుల్లో ధాన్యం కొనుగోలు చేస్తారు. రైతు భరోసా నగదు విడుదల, ప్రకృతి విపత్తులు సంభవించి రైతులు పంటను కోల్పోతే నష్టపరిహారం, పంట బీమా పొందేందుకు దరఖాస్తు చేసుకునే సమయంలోనూ ఈ-క్రాప్‌లో నమోదైన వివరాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేయాలంటే వీఏఏలు, వీఆర్వోలు కచ్చితంగా పొలం వద్దకు వెళ్లాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. భూమి సాగు చేస్తున్న వారి పేరు. భూమి సర్వే నంబరు, రైతు బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు నంబరును ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయాలి.

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ఈ-క్రాప్ బుకింగ్‌లో సాంకేతిక అవరోధాలు లేవు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవడం వలన రైతులకు లాభం చేకూరుతుంది. ఇదే విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కేఎస్‌వీ రమేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

ఈ-కేవైసీ చేయాల్సి ఉంది



ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ చేయాల్సి ఉంది. ఈకేవైసీ చేస్తేనే ప్రయోజనాలు చేకూరతాయి. వచ్చే నెల 15వ తేదీ వరకు ఈకేవైసీకి గడువు ఉన్నప్పటికీ లక్ష్యాన్ని ముందుగానే చేరుకుంటాం.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, మండపేట

పెరుగుతున్న వరద ఉధృతి



కోటిపల్లి ఫెర్రీలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

కె.గంగవరం: కాటన్ బ్యారేజ్ వద్ద మిగులు జలాలను సముద్రంలోకి వదలడం వల్ల మండల పరిధిలోని కోటిపల్లిలో వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. రెండు వారాల వ్యవధిలో గోదావరి ఉధృతి తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరగడం ఇది నాల్గొవ సారి. కోటిపల్లి ఫెర్రిలో గల పుష్కర ఘాట్ మెట్ల వరకు మునిగి వరద నీరు ప్రవహిస్తోంది. సుందరపల్లి వద్ద గోదావరి గట్టు బలహీనంగా ఉండడంతో గట్టును పటిష్టం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పీడబ్ల్యూడీ ఏఈ రెహమాన్ తెలిపారు. ఉధృతి ఇంకా కొనసాగడంతో నెల రోజులుగా పంటు ప్రయాణాన్ని రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. ఉధృతి పూర్తిగా తగ్గిన తరువాత ముక్తేశ్వరం వైపు కంకర రహదారి నిర్మించిన అనంతరం కాకపోకలు కొనసాగిస్తామని అధికారులు చెప్పారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రానున్న రెండు, మూడు రోజుల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు, లంక రైతులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు సూచించారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పంపన నాగమణి

కె.గంగవరం: మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాఖల వారీగా ప్రగతి నివేదికను సభ్యులకు వివరించాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వెలుగు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, వైద్య. విద్య తదితర ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు నివేదిక చదివి సభలో వినిపించారు. ఆయా శాఖలకు చెందిన సభ్యులు సమస్యలపై అధికారులను నిలదీశారు. పలువురు ఎంపీటీసీలు సర్పంచ్‌లు మాట్లాడుతూ జగనన్న గృహ కాలనీల వద్ద రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇటీవల గ్రామంలో తొలగించిన విద్యుత్ స్తంభాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని, వాటిని పంచాయతీకి అప్పగించాలని పాణింగపల్లి సర్పంచ్ చీకట్ల సునీతగోపలం సూచించారు. విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామన్నారు. సత్యవాడ సర్పంచ్ సలాది అన్నపూర్ణ మాట్లాడుతూ గ్రామంలో పంచాయితీ తరుపున నాటిన 200 కొబ్బరిచెట్ల సంరక్షణకు ఉపాధి హామీ సిబ్బంది రావడం లేదని అన్నారు. కూళ్ల సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది ప్రొటోకాల్ పాటించడం లేదని విమర్శించారు. కూళ్ల ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పామర్రు పీహెచ్‌సీకి సంబంధించిన నూతన భవనాన్ని వెంటనే అందుబాటులోనికి తీసుకురావాలని కోరారు.

బకాయిలు చెల్లింపునకు సమయం కావాలి

సభలో విద్యుత్ శాఖ ఏఈ భాస్కర్ పంచాయతీలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు చెల్లించాలని చెప్పడంతో ఒక్కసారిగా సర్పంచ్‌లు ఆవేశానికి లోనయ్యారు. పంచాయతీలకు 10 నెలలుగా ఆదాయం లేదని, ఇటీవల 15వ ఫైనాన్స్ నిధులు వచ్చాయన్నారు. వాటితో విద్యుత్ బకాయిలు చెల్లిస్తే పంచాయితీల అభివృద్ధి, జీతాల చెల్లింపు ఎలా అని సర్పంచ్‌లు ప్రశ్నించారు.విద్యుత్ బకాయిలు చెల్లింపునకు సమయం కావాలని వారు కోరారు.

నోటీసులు ఇవ్వడం దారుణం

వైఎస్సార్ సీపీ హయాంలో ఇళ్లు లేని వారికి మాత్రమే స్థల పట్టాలు ఇచ్చామని సర్పంచ్‌లు అన్నారు. వారిలో కొందరు ఇళ్లు నిర్మించలేదన్నారు. ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ సిబ్బంది స్థలం పొంది ఇళ్లు నిర్మించుకోని వారికి నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. ఇళ్ల స్థలాలను తిరిగి తీసుకుంటామని అధికారులు చెప్పడం దారుణమని సర్పంచ్‌లు అన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో భాగస్వాములై ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ నాగమణి సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. ఎమ్మార్వో ప్రసాద్, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఏఓ సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ విజేతలకు ఘన సత్కారం



ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారిని సత్కరిస్తున్న నాయకులు



ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారిని సత్కరిస్తున్న సర్పంచ్ వెంకట్రావు, గ్రామ పెద్దలు

కాజులూరు: గొల్లపాలెం హైస్కూల్‌కు చెందిన ఏడుగురు పూర్వపు విద్యార్థులు మెగా డీఎస్సీలో విజేతలుగా నిలిచి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన చింతలక్రింద శ్రీనివాసరావు (పీఈటీ), పోతురాజు శ్రీను (ఎస్ఎఎఫ్ఈ), వసుంతనోజ్‌కుమార్ (ఎస్ఎఎఫ్ఈ), ఒలేటి మైథిలి (ఎస్ఎఎఫ్ఈ), మసాబత్తుల శ్రీనుబాబు (ఎస్ఏ బయాలజీ), పోతురాజు వెంకటేష్‌బాబు (ఎస్జీటీ), డేగల రవళి (ఎస్జీటీ) ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికై న వారిని శనివారం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, పీఏసీఎస్ చైర్మన్ అంగర కృష్ణ, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముర్రే శివశంకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాయవరం: ఉపాధ్యాయ కొలువులు సాధించిన యువకులు చిన్నారులకు ఉత్తమ సేవలందించి గ్రామానికి మరింత ఖ్యాతిని తీసుకునిరావాలని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. వెంటూరు గ్రామానికి చెందిన ఏడుగురు మెగా డీఎస్సీ-2025లో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం పంచాయతీలో వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న కృష్ణప్రదీప్, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ తదితరులు విజేతలను అభినందించారు.ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉందుర్తి వీరవేణి, వాసంశెట్టి శిరీష, వాసంశెట్టి మంగలక్ష్మి, తుంపాల వీవీఎస్వై మణికంఠ, మేడిశెట్టి స్వాతి, గిలకా దుర్గాభవాని, కొండయ్యపాలెపు కృష్ణవేణిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రిమ్మలపూడి సూర్యనారాయణ, వాసంశెట్టి లోవరాజు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ప్రగతి

రామచంద్రపురం రూరల్: మహిళ ఆరోగ్యంతోనే ఆ కుటుంబం కుటుంబం ప్రగతి ముడిపడి ఉంటుందని రామచంద్రపురం శారదా నర్సింగ్ హోమ్ గైనకాలజీ డాక్టర్ శ్రావ్య అన్నారు. యనమదలలో శనివారం సర్పంచ్ పంపన వీరవెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు విత్తనాల వెంకటరమణ, డివిజన్ మెడికల్ సూపర్‌వైజర్ జి.కమలేషు, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, సూపర్‌వైజర్లు వైకుంతరావు, రత్నం పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యత

కపిలేశ్వరపురం (మండపేట): మహిళ ఆరోగ్య పరిరక్షణ సామాజిక బాధ్యత అని స్వస్థ నారీ స్వసక్తి అభియాన్ పరివార్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పథకంలో భాగంగా మండపేట పట్టణంలోని పార్థసారథి నగర్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి వి.భవాని మహిళలను పరీక్షించి ఆరోగ్య సలహాలను ఇచ్చారు. కౌన్సిలర్లు నీలం దుర్గ, మొండి భవాని, ఆర్థోపెడిక్ వైద్యుడు డా.రాము, గైకాలజిస్ట్ జ్యోతిర్మయి, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, శిశువు ఆరోగ్యంపైనే భావితరం భవిష్యత్తు

కాజులూరు: గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపైనే భావితరం భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని జగన్నాథగిరి సర్పంచ్ కొలాని అచ్యుతాంబ అరుణ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ సబ్‌సెంటరు వద్ద శనివారం గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యాధికారులు 'స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించి 130 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసనలు, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ కొలాని అచ్యుతాంబ అరుణ, ఎంపీటీసీ కొప్పన లక్ష్మీ, కొలాని గణేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు




ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సురేష్‌కుమార్, సాయిప్రసాద్

రామచంద్రపురం: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే విధంగా ఈ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతి పేరుతో ప్రైవేటీకరణను చేస్తోందని, దీనిని వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బొడ్డపాటి సురేష్‌కుమార్, రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ వైఎస్సార్ సీపీ విప్ వాద్రేవు సాయిప్రసాద్ స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలకు అనుమతి తీసుకువచ్చి నిర్మాణం చేపట్టారన్నారు. అందులో ఇప్పటికే 5 కళాశాలను నిర్మించి ప్రారంభించారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం మిగిలిన కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్మిస్తామని ప్రకటించడం ప్రైవేటీకరణ చేయడమేనని అన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిని ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్మించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసినట్లు వారు తెలిపారు.

దుర్గామాత తోడుంటే సమస్యలు దూరం

- లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవార్లు
- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



వెదురుపాక పీఠంలో విజయదుర్గ అమ్మవారు



ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

రాయవరం: దుర్గామాత తోడుంటే ఎటువంటి సమస్యలు దూరమవుతాయని, ఎంతటి కష్టాన్ని అయినా ఎదుర్కొనే ధైర్యం ఉంటుందని, ప్రతి ఒక్కరూ అమ్మతత్వాన్ని అలవర్చుకోవాలని సాహితీవేత్త మల్లాప్రగడ శ్రీమన్నారాయణ భక్తులకు ఉద్బోధించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం విజయదుర్గా అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అలంకరించారు. పీఠాధిపతి వాద్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) భక్తులనుద్దేశించి ఆధ్యా త్మిక ప్రసంగం చేశారు. పలువురు భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో విజయదుర్గ అమ్మవారు

పీఠంలో విజయదుర్గ అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాద్రేవు వేణుగోపాల్ (బాబి), విజయ దుర్గా సేవా ప్రతినిధుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామార్చనలతో అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాల్లో 6 వ రోజు శనివారం అమ్మవారి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12 వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమకు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో లలితా దేవి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి అరుణ్‌కుమార్, త్రిపురమల్లు గోపాల్ లు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీశ్రీశ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేయగా, ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.

రిక్షా స్టాండ్‌ను తొలగిస్తే ప్రతిఘటిస్తాం



మండపేట బస్టాండ్ వద్ద నినాదాలు చేస్తున్న రిక్షా కార్మికుల సంఘ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట బస్టాండ్ వద్ద ఉన్న రిక్షా స్టాండ్‌ను తొలగించే ప్రయత్నం చేస్తే ప్రతిఘటిస్తామని రిక్షా కార్మిక సంఘం నాయకులు, ఇతర ప్రజా సంఘాలు నేతలు మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. ఇటీవల బస్టాండ్ సమీపంలోని దుకాణాలను తొలగించిన నేపథ్యంలో రిక్షా స్టాండ్‌ను తొలగిస్తారన్న ప్రచారం జరుగుతోందని నాయకులు ఆవేదనను వ్యక్తం చేశారు. రిక్షా స్టాండ్ వద్ద శనివారం జైభీమ్ రిక్షా కార్మికుల సంఘ పట్టణ అధ్యక్షుడు అయినవిల్లి రమణ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ధూళి జయరాజు, 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, సీపీఐ నాయకులు రామకృష్ణ మాట్లాడారు. రిక్షా కార్మికుల ఉపాధి జోలికొస్తే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బుట్టా వీర్రాజు, ఏల్చూరి ఏసు, చాపల సత్తెన్న, కొమ్ము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కో బకాయిలు వెంటనే చెల్లించాలి



అంగర చేనేత సంఘం ఎదుట నినాదాలు చేస్తున్న నేత కార్మికులు

కపిలేశ్వరపురం: అంగరలోని గణపతి చేనేత పారిశ్రామికుల సంఘం రాష్ట్రంలోనే పేరెన్నిక గల సంఘం. ఒకప్పుడు రాష్ట్రంలో అంగర శారీస్ బ్రాండ్ పేరుతో విక్రయాలు జరిపిన సంఘం. నేతన్నల శ్రమతో తయారు చేసిన వస్త్రాలకు వినియోగదారుల్లో డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. ఆప్కో సంస్థ నుంచి అంగర సంఘానికి సుమారు రూ.కోటి బకాయిలు రావాల్సి ఉంది. ఈ విషయమై అనేక సార్లు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో నేత కార్మికులు శనివారం సహకార సంఘం ఎదుట ఆందోళన చేపట్టారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. చెల్లించే వరకూ ఆందోళన కొనసాగిస్తామంటూ గ్రామ వీధుల్లో ర్యాలీ చేశారు.